సాక్షి ప్రకాశం

శుక్రవారం | 20 | జనవరి | 2023



పోలీసులకు ఎస్పీ అభినందన

గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా యూఐ కేసులను గణనీయంగా తగ్గించడానికి కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ మలికాగర్గ్ గురువారం అభినందించారు. - 8లో..



చెడుగుడు విజేత.. నెల్లూరు

సంక్రాంతి సందర్భంగా నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆహ్వాన చెడుగుడు పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టు విజయం సాధించింది. - 8లో..

గరిష్టం/కనిష్టం 30/21

వాతావరణం

పొగ మంచు కురుస్తుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి

న్యూస్‌రీల్

పెట్రోల్ సబ్సిడీకి దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

ఒంగోలు: ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో స్వయం ఉపాధి, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ రెట్రో ఫిట్టింగ్ మూడు చక్రాల వాహనాలు కలిగిన దివ్యాంగ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం పెట్రోలు సబ్సిడీ మంజూరు చేస్తోందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ రెండు జిల్లాల అధికారి జి.అర్చన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగి పెట్రోలు సబ్సిడీ పొందేందుకు ఆసక్తి ఉన్న దివ్యాంగ అభ్యర్థులు స్థానిక ప్రకాశం భవనంలోని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ కార్యాలయం నుంచి దరఖాస్తులు పొందాలని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈ నెల 27వ తేదీ లోగా కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయ పనివేళల్లో 08592-281310 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వేమన శతకాలతో మంచి నడవడిక

- యోగి వేమన జయంతి కార్యక్రమంలో డీపీవో నారాయణరెడ్డి



వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీపీవో

ఒంగోలు అర్బన్: చిన్నతనంలో వేమన శతకాలు నేర్చుకుంటే మంచి నడవడిక ఏర్పడి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) నారాయణరెడ్డి అన్నారు. యోగి వేమన జయంతి ఉత్సవాలను స్టెప్, పర్యాటక, విద్యాశాఖల ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన సమావేశ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీపీవో.. యోగి వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేమన జీవనసారాన్ని తెలుసుకుని ఆయన సూచించిన మార్గంలో నడవాలని విద్యార్థులకు సూచించారు. తల్లిదండ్రులంతా వారి పిల్లలకు వేమన శతకాలు నేర్పించాలని కోరారు. విద్యార్థి దశ నుంచి చదువుతో పాటు శారీరక దారుఢ్యం కలిగేలా క్రీడలు ఆడాలన్నారు. కార్యక్రమానికి హాజరైన ఇతర ప్రముఖులు వేమన పద్యాలు పఠించి వాటి భావాలను వివరించారు. అనంతరం వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారి రోజ్‌రాణి, చేనేత ఏడీ ఉదయ్‌కుమార్, నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, టూరిజం అధికారి బెన్‌హర్, స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ, ఇతర అధికారులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి

త్రిపురాంతకం: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ చైర్మన్ రాకేష్ కశ్యప్ పేర్కొన్నారు. త్రిపురాంతకం, దూపాడు ఏపీజీబీ బ్యాంకుల్లో జరిగిన కస్టమర్స్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు ద్వారా పీఎం జేజేబీవై, పీఎం ఎస్‌బీవై, అటల్ పెన్షన్ యోజన, డిజిటల్ బ్యాంకింగ్, రైతు రుణాలు, మహిళ పొదుపు రుణాలు, విద్య, గృహ, వాహన రుణాలు ఖాతాదారులు వినియోగించుకోవాలని కోరారు. బ్యాంకుల్లో డిపాజిట్లు చేయడం వల్ల తగిన భద్రత ఉంటుందని రాకేష్ కశ్యప్ వివరించారు. సమావేశంలో రీజినల్ మేనేజర్ హేమలత, మేనేజర్లు వెంకన్న, వదన్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం త్రిపురాంతకం బాలాత్రిపురసుందరీదేవి, త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయాల్లో బ్యాంక్ చైర్మన్ పూజలు నిర్వహించారు.

హేచరీల నకిలీ సీడ్‌తో నష్టపోతున్న రొయ్య రైతులకు వైరస్‌లతో కొత్త కష్టం వచ్చిపడింది. చచ్చీ చెడీ రొయ్యలను కాపాడుకుంటుంటే శీతాకాలంలో వివిధ రకాల వైరస్‌లు చుట్టుముట్టాయి. ప్రధానంగా తెల్లమలం (వైట్ ఫీకల్), వైట్ గ్రిడ్, ఈపీహెచ్‌సీ తదితర వైరస్‌లు సోకుతున్నాయి. దీంతో రైతులు నష్టాలపాలయ్యే ప్రమాదం ఏర్పడటంతో అప్రమత్తమైన అధికారులు రైతులకు అండగా నిలిచారు. సకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తున్నారు.



వైరస్ సోకిన రొయ్యలు

రొయ్యకు వైరస్ కాటు

- చలికాలం ఆక్వా సాగులో సమస్యలు
- వైట్ స్పాట్, ఈపీహెచ్‌సీ, వైట్ గట్, వైట్ ఫీకల్ వైరస్‌లు
- జాగ్రత్తలు పాటించాలంటున్న మత్స్యశాఖ అధికారులు

టంగుటూరు: శీతాకాలం.. ఆక్వాకు గడ్డుకాలంగా మారింది. రొయ్యలను వైరస్‌లు వెంటాడుతున్నాయి. ఈ సీజన్‌లో ప్రధానంగా వైట్ ఫీకల్ (తెల్లమలం) వైరస్ సోకుతోంది. దీంతో రొయ్య ఒత్తిడికి గురవుతోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో సుమారు 26 వేల ఎకరాల్లో సుమారు 14 వేల మంది రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. చీరాల, వేటపాలెం, చినగంజాం, టంగుటూరు, సింగరాయకొండ, ఉలవపాడు, కరేడు, ఉప్పుగుండూరు మండలాల్లోని వేలాది ఎకరాల్లో రొయ్యల సాగు జరుగుతోంది. రొయ్యల సాగును మూడు విడతల్లో చేపడతారు. ఒక్కో సీజన్‌కు దాదాపు 30 వేల టన్నుల రొయ్యల దిగుబడి వస్తోంది. చలికాలంలో వివిధ రకాల వైరస్‌లు రొయ్యలను చుట్టుముడుతుంటాయి. సకాలంలో జాగ్రత్తలు తీసుకోకపోతే రైతు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది.

ఈపీహెచ్‌సీ వైరస్

ఇదో రకమైన శిలీంధ్రం ద్వారా రొయ్యలకు వ్యాప్తి చెందుతోంది. ఒక చెరువు నుంచి మరో చెరువుకు వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. ఈ వైరస్ సోకిన చెరువును వెంటనే ఖాళీ చేయాలి. లేకపోతే రైతుకు తీవ్రనష్టం జరుగుతుంది. ఈ రకం వైరస్‌కు గురైన రొయ్యలు చెరువు పైభాగంలో తిరుగుతూ మేత తీసుకోకుండా ఉంటాయి.

వైట్ గ్రిడ్

ఆక్వాను ఎక్కువగా పట్టి పీడిస్తున్న వైరస్. ఇది సోకిన సమయంలో రొయ్యల్లో లూజ్ షెల్ వస్తుంది. ఆహారాన్ని సైతం తీసుకోవు. ఫలితంగా రొయ్య ఎదుగుదల ఆగిపోతుంది. ప్రతి వారం చెరువులో నీటిని పరీక్ష చేయించాలి. చెక్ ట్రేల ద్వారా మేతను అందిస్తూ గంటకోసారి పరిశీలించాలి. నాణ్యమైన గట్ ప్రోబయోటిక్స్ వాడకంతో రొయ్యల్లో ఫీడ్ సామర్థ్యం పెరుగుతోంది. దీంతో వైరస్ నుంచి రొయ్య బయట పడేందుకు అవకాశం ఉంటుంది.

పీపీటీ తగ్గితే ప్రమాదం

సాధారణంగా రొయ్యలు సాగు చేసేందుకు నీటిలో ఉప్పు శాతం 27 పీపీటీ వరకు ఉండేలా రైతులు చూసుకోవాలి. చలికాలంలో ఏర్పడే తుఫానుల కారణంగా చలితో కూడిన వర్షాలు పడతాయి. ఈ క్రమంలో చెరువులోని ఉప్పు శాతం పడిపోతుంది. ఫలితంగా రొయ్యల్లో ఆకలి మందగించడం, గుల్లగొట్టడం వంటివి జరుగుతాయి. అంతేకాక వైరస్ నిరోధక శక్తి తగ్గుతుంది. వీటి కారణంగా నాణ్యత సైతం తగ్గుతుంది.

నిలకడగా ఆక్సిజన్ లెవల్స్

సాధారణంగా చలికాలంలో ఉష్ణోగ్రతలు పడిపోతుంటాయి. రొయ్యలు చెరువులో 27 డిగ్రీల నుంచి 32 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య జీవించేందుకు అనుకూలం. చలికాలంలో మంచు ఎక్కువగా కురుస్తుండటంతో ఆక్సిజన్ లెవల్స్ పడిపోతాయి. దీనికి తోడు నీటిలోని పీహెచ్ లెవల్స్ తగ్గిపోతుంటాయి. 7.5 నుంచి 8 మధ్యలో పీహెచ్ లెవల్స్ ఉండాలి. అవి తగ్గడంతో నీటికి ఆమ్లత్వం వస్తుంది. పీహెచ్ 7కి పడిపోతే హైడ్రోజన్ సల్ఫేట్, పీహెచ్ 8కి మించితే అమ్మోనియా విషవాయువులు విడుదలవుతాయి. వీటి కారణంగా రొయ్యలు ఒత్తిడికి గురై నీటిపై తేలాడి 20 నిమిషాల్లోనే చనిపోయే అవకాశం ఉంది. ఈ పరిస్థితులను తట్టుకోవాలంటే రాత్రి సమయంలో ఆక్సిజన్ అందించేందుకు ఏయిరేటర్లు నిరంతరం తిరిగేలా చర్యలు తీసుకోవాలి. ఒత్తిడిని తగ్గించి వ్యాధి నిరోధకతను పెంచేందుకు ప్రోబయోటిక్స్‌ను ఫీడ్‌లో కలిపి అందిస్తుండాలి. ఉష్ణోగ్రతలు తగ్గిన సమయంలో రొయ్యలు మేతను పూర్తి స్థాయిలో తీసుకోవు. ఫీడ్ వ్యర్థం కాకుండా తగినంత మోతాదులో అందించాలి. వీటికి తోడు అగ్రికల్చర్ లైమ్ (సున్నం)ను ఒక ఎకరానికి 50 కేజీలు నీటిలో కలుపుకోవాలి. చలికాలంలో ఎకరా చెరువుకు లక్ష పిల్లలను సాగు చేయడం మంచిది.



అనంతవరంలో సాగులో ఉన్న రొయ్యల చెరువు



వైరస్‌లతో ఇబ్బందులు

వివిధ రకాల వైరస్‌లు సోకడంతో రొయ్యలు మేత తినక ఎదుగుదల తగ్గిపోతోంది. కొన్నిసార్లు రొయ్యలు పైకి తేలడంతో మధ్యలోనే చెరువుని తీసేయాల్సి వస్తోంది. పక్క చెరువుకు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– ఉప్పలపాటి నాగరాజు, అనంతవరం, టంగుటూరు మండలం



రైతులు జాగ్రత్తలు పాటించాలి

శీతాకాలంలో రైతులు జాగ్రత్తలు పాటించాలి. వైరస్‌లు సులభంగా రొయ్యలకు వ్యాపిస్తాయి. తరచూ ఆక్సిజన్ లెవల్స్, ఫీడ్ సామర్థ్యం గంటకొకసారి పరిశీలించాలి. అధికారుల సూచనల మేరకు ప్రోబయాటిక్స్ మందులు వాడాలి.

– ఆవుల చంద్రశేఖరరెడ్డి, జిల్లా మత్స్యశాఖ జేడీ

గంజాయి జాడ లేకుండా చేద్దాం

- మాదక ద్రవ్యాలను నిర్మూలించాలి
- డ్రగ్ మాఫియాకు చెక్ పెట్టాలి
- పోలీసు అధికారులకు ఎస్పీ మలికాగర్గ్ దిశానిర్దేశం
- జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక సెమినార్



మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్, హైదరాబాద్ సబ్ జోన్ సూపరింటెండెంట్ సుమిత్ ఆర్య

ఒంగోలు టౌన్: జిల్లాలో గంజాయి జాడ లేకుండా చేసి మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలించడానికి పోలీసు అధికారులు కంకణం కట్టుకోవాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదేశించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల కేసుల్లో అవలంబించాల్సిన విధివిధానలపై జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సెమినార్‌లో హైదరాబాద్ సబ్ జోన్ సూపరింటెండెంట్ సుమిత ఆర్య పాల్గొని నార్కోటిక్స్ కేసుల దర్యాప్తులో పాటించాల్సిన మెళకువలను వివరించారు. నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాలను గుర్తించే విధానాలు, ఎన్‌డీపీఎస్ కేసుల నమోదులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేర నిరూపణ, సీజ్ చేసిన మత్తు పదార్థాలను డిస్ట్రాయ్ చేసే ప్రక్రియలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పోలీసు అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్ కేసుల్లో నిందితులను న్యాయస్థానంలో నిలబెట్టే ముందు కేసులు వీగిపోకుండా తగిన రుజువులు సేకరించాలని అధికారులకు సూచించారు. గ్రామ, వార్డు మహిళా పోలీసుల సహకారంతో గంజాయి విక్రయాలపై నిఘా ఉంచాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో పోలీసులు వినూత్న విధానాలను అవలంబించాలన్నారు. నార్కోటిక్స్ అనేది సమాజానికి పట్టిన చీడ అని, డ్రగ్స్‌కు అలవాటు పడిన జీవితాలు ఎలా నాశనమవుతాయో ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. యువత, విద్యార్థుల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రకాశం పోలీసులు మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన ఎన్‌డీపీఎస్ కేసులపై సమీక్షించారు. ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైమ్) ఎస్‌వీ శ్రీధరరావు, ఎస్‌ఈబీ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీఎస్పీలు యు.నాగరాజు, నారాయణస్వామిరెడ్డి, కె.కిశోర్‌కుమార్, డీటీసీ డీఎస్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండల, క్లస్టర్ కన్వీనర్ల ఎంపిక

- ఒంగోలు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- మూడు క్లస్టర్లుగా ఒంగోలు నగరం
- ఒక్కో క్లస్టర్‌కు ఒక్కొక్కరు చొప్పున నియామకం
- మండలానికి ఒకరికి బాధ్యతలు

ఒంగోలు: ఒంగోలు నియోజకవర్గానికి సంబంధించి జగనన్న సచివాలయాల మండల/క్లస్టర్ కన్వీనర్ల ఎంపికను వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పూర్తి చేశారు. స్థానిక తన నివాసంలో గురువారం వారికి బాధ్యతలు అప్పగించి దిశానిర్దేశం చేశారు. దీంతో పార్టీలో నూతనోత్సాహం నెలకొంది. ఒంగోలు నియోజకవర్గ పరిధిలో ఒంగోలు నగరంతో పాటు ఒంగోలు, కొత్తపట్నం మండలాలు ఉండటంతో మండలానికి ఒక కన్వీనర్‌ను నియమించారు. ఒంగోలు మండల కన్వీనర్‌గా కె.సోమశేఖర్, కొత్తపట్నం మండల కన్వీనర్‌గా ఆళ్ల రవీంద్రారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఒంగోలు నగరాన్ని మూడు క్లస్టర్లుగా విభజించారు. పార్టీలో సీనియర్ లీడర్లుగా ఉండి యాక్టివ్‌గా పనిచేస్తున్న వారిని ఆయా క్లస్టర్లకు కన్వీనర్లుగా ఎంపిక చేశారు. పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సయ్యద్ జలీల్‌ను మొదటి అర్బన్ క్లస్టర్ కన్వీనర్‌గా నియమించారు. ఈయన పరిధిలో ఒకటో డివిజన్ నుంచి 16వ డివిజన్ వరకు ఉంటాయి. రెండో అర్బన్ క్లస్టర్ కన్వీనర్‌గా వైఎస్సార్ సీపీ నాయకుడు కొమ్మూరి రవిచంద్రను నియమించారు. ఈయన పరిధిలో 17వ డివిజన్ నుంచి 32వ డివిజన్ వరకు ఉంటాయి. మూడో అర్బన్ క్లస్టర్ కన్వీనర్ బాధ్యతలను వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడుకు అప్పగించారు.

ఈయనకు 33వ డివిజన్ నుంచి 50వ డివిజన్ వరకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే ఒక్కో సచివాలయ పరిధిలో ముగ్గురిని, వారిపై క్లస్టర్ కన్వీనర్లను నియమించారు. వీరికితోడు వైఎస్సార్ సీపీ మండల, అనుబంధ కమిటీలు ఉన్నాయి. వీరందరి ద్వారా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయనున్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాల బురద చల్లుడు విధానాన్ని తిప్పికొట్టి ప్రజలకు వాస్తవాలను వివరించనున్నారు. తద్వారా ప్రజల హృదయాలకు మరింత దగ్గరై వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశిస్తున్న 175/175 లక్ష్య సాధనలో భాగం కానున్నారు.

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి



మాట్లాడుతున్న మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి

- మార్కాపురం ఎమ్మెల్యే కేపీ పిలుపు

మార్కాపురం: తూర్పు రాయలసీమ నియోజకవర్గం నుంచి పట్టభద్రుల తరఫున వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి కోరారు. మార్కాపురం పట్టణంలోని ఏ-1 గ్లోబల్, డాక్టర్ శామ్యూల్ జార్జి, కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలు, ఎన్ఎస్ కల్యాణ మండపంలో పట్టభద్రులతో గురువారం నిర్వహించిన సమావేశాల్లో ఎమ్మెల్యే కేపీ పాల్గొన్నారు. ఏ-1 గ్లోబల్ కళాశాల చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ షంషేర్ అలీ బేగ్, డాక్టర్ శామ్యూల్ జార్జి కళాశాలలో మంత్రి ఆదిమూలపు సురేష్ సోదరుడు డాక్టర్ సతీష్, కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశాలలో ఎమ్మెల్యే కేపీ మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీసులతో ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. యువతీ యువకులు, పట్టభద్రుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పాటుపడుతోందన్నారు. యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. సచివాలయం, ఆర్‌బీకే వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే వెనుకబడిన పశ్చిమ ప్రకాశంపై ప్రత్యేక దృష్టి పెడతానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షంషీర్ అలీ బేగ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కేపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటికి నియోజకవర్గంలో అత్యంత మెజార్టీ సాధించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, కమలా విద్యా సంస్థల కరస్పాండెంట్ పి.పవన్ కుమార్, డాక్టర్ మగ్బుల్ బాషా, ప్రైవేటు పాఠశాలల అధ్యక్షుడు జి.మల్లికార్జునరెడ్డి, కె.రంగయ్య, కృష్ణారెడ్డి, ప్రతినిధులు, గ్రాడ్యుయేట్లు, టీచర్లు పాల్గొన్నారు.

గడపగడపలో జగనన్న పథకాలే

- పార్టీలకతీతంగా ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు
- జగనన్నకు అండగా నిలుద్దాం
- మళ్లీ సీఎంగా గెలిపించుకుందాం
- జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పిలుపు



గిరిజనుల బుట్టలు అల్లి ఉత్సాహపరుస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డికి హారతితో స్వాగతం పలుకుతున్న పథకాల లబ్ధిదారులు

చీమకుర్తి: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఏ ఇంటికెళ్లినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే స్వాగతం పలుకుతున్నాయని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో చీమకుర్తి మున్సిపాలిటీలోని 10, 11 వార్డుల్లో గురువారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆయా వార్డుల్లోని ప్రతి గడపలో సంక్షేమ పథకాల లబ్ధిదారులు ఎంతో ఆనందంగా పూల వర్షం కురిపిస్తూ పూలమాలలు, హారతులతో ఘనంగా స్వాగతం పలికారు. సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారుల కళ్లలో ఆ వెలుగులు స్పష్టంగా కనిపిస్తున్నాయని బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలను అమలు చేసే సమయంలో పార్టీలను పక్కనపెట్టి అర్హత ఒక్కటే కొలమానంగా తీసుకోవడం వలనే గడపగడపలో లబ్ధిదారులు తమకు బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పథకాలు పొందిన లబ్ధిదారులంతా అండగా నిలవాలని, మళ్లీ సీఎంగా జగనన్నను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తేనే పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.


తొలుత 10, 11 వార్డుల్లోకి ప్రవేశించే ముందు ఆయా వార్డుల కౌన్సిలర్లు బడే పద్మ అయ్యపరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాపతు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో బూచేపల్లి వెంకాయమ్మ, టీజేఆర్ సుధాకర్‌బాబు, బూచేపల్లి శివప్రసాదరెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. 11వ వార్డులో వైఎస్సార్ సీపీ నాయకుడు కుంచాల రాంబాబు ప్రత్యేకంగా ఆహ్వానం పలికారు. తొలుత బూచేపల్లి నివాసం నుంచి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమైంది. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబుకు జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తిలకం దిద్ది కార్యక్రమాన్ని ప్రారంభించారు. మధ్యలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ గిరిజనులకు సంబంధించిన బుట్టలు అల్లి పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్ణిపాటి శేఖరరెడ్డి, మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్.మాణిక్యం, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటితో పూర్తికానున్న 50 వేల గడపలు...

పులికొండ గ్రామంలో శుక్రవారం నిర్వహించనున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు 50 వేల గడపలను పూర్తి చేసుకోనున్నారు. 2022 మే 13న నాగులుప్పలపాడులో ప్రారంభించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 110 రోజుల్లో 50 వేల గడపలు పూర్తి చేసుకోనుందని ఎమ్మెల్యే టీజేఆర్ తెలిపారు. పులికొండ గ్రామంలో నిర్వహించే ప్రాధాన్యత కలిగిన కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులంతా హాజరుకావాలని కోరారు.

సబ్‌ప్లాన్‌పై మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదు

- ఎమ్మెల్సీ పోతుల సునీత



చీరాల: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, వారి సంక్షేమం గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత ధ్వజమెత్తారు. గురువారం చీరాలలోని కొత్తపేటలో ఆమె నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ ఎస్సీల పుట్టుకను చంద్రబాబు తీవ్రంగా అవమానించారని, ఎస్సీ కులాల్లో ఎవరైనా పుడతారా.. అంటూ అవహేళన చేసిన చంద్రబాబుకు వారి గురించి మాట్లాడే హక్కు లేదని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ద్రోహిగా చంద్రబాబు చరిత్రలో మిగిలిపోతారన్నారు. పెత్తందారీవర్గాల అభ్యున్నతికి పాటుపడే చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. 2019లో ప్రజలు తగిన బుద్ధి చెప్పి ఇంట్లో కూర్చోబెట్టినా సిగ్గు, శరం లేకుండా ఇంకా జనాల్లో తిరుగుతున్నాడంటే అతడు మనిషే కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు 90 శాతం వారి అభివృద్ధికి, విద్య, వైద్యం, సంక్షేమం కోసం ఖర్చు పెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. పచ్చ మీడియాను అడ్డుపెట్టుకుని ప్రతి చెడ్డమాటను మంచి రాతలుగా అడ్డగోలుగా రాయించుకుంటూ పబ్బం గడుపుకుంటున్నాడని చంద్రబాబుపై ఆమె ధ్వజమెత్తారు. చెట్టు పేరు చెప్పుకుని కాయలు అమ్ముకున్న చందంగా ఎన్టీఆర్ పేరు చెప్పుకుని ఓట్లు అడుక్కుంటున్నాడేగానీ స్వతహాగా ఆర్క్‌ను వెన్నుపోటు పొడిచి ఆయన పార్టీని, పార్టీ గుర్తును లాక్కున్న విషయం రాష్ట్ర ప్రజలతో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఇంకా మరచిపోలేదన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబుకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మండిపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేద ప్రజలకు నవరత్నాలు అమలు చేస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు నెరవేర్చుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి- సంక్షేమం దిశగా పరుగులు పెట్టిస్తుంటే ఓర్చుకోలేని చంద్రబాబు.. ముఖ్యమంత్రి జగనన్నపై లేనిపోని విమర్శలు చేస్తున్నాడని పోతుల సునీత మండిపడ్డారు. చంద్రబాబుకు ఉన్న ప్రచార యావతో కందుకూరు సభలో 8 మంది, గుంటూరు సభలో ముగ్గురు మృతి చెందితే చంద్రబాబుకు చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలను ప్యాకేజీ స్టార్ పవన్ కళ్యాణ్ ఏమాత్రం ఓదార్చకుండా సిగ్గులేకుండా చంద్రబాబు ఇంటికి స్వయంగా వెళ్లాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కంటే చంద్రబాబే తనకు ఎక్కువని పవన్ కళ్యాణ్ పరోక్షంగా చెప్పడం చూస్తుంటే ప్రజలపై ఆయనకు ప్రేమ లేదని అర్థమవుతోందని సునీత పేర్కొన్నారు.

24న ఎంపిక ప్రదర్శనలు

ఒంగోలు: గణతంత్ర దినం సందర్భంగా ఈ నెల 26వ తేదీ స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న వేడుకల్లో ప్రదర్శించేందుకు డ్యాన్స్, నృత్య రూపకాలను స్థానిక ప్రకాశం భవన్‌లోని స్పందన సమావేశ మందిరంలో ఈ నెల 24వ తేదీ ఎంపిక చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వి.విజయభాస్కర్ తెలిపారు. ఆసక్తి గల అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులు హాజరుకావచ్చన్నారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా డ్యాన్స్‌లు, నృత్య రూపకాలు ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 73827 97374 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఏపీ వెటర్నరీ కౌన్సిల్ అధ్యక్షునిగా రామకృష్ణారెడ్డి


రామకృష్ణారెడ్డికి అభినందనలు తెలుపుతున్న పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ అమరేంద్ర కుమార్

బేస్తవారిపేట: ఏపీ వెటర్నరీ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షునిగా బేస్తవారిపేట మండలంలోని సోమవారిపేట పశువైద్య శాల పశువైద్యాధికారి కామిరెడ్డి రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. గురువారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ కౌన్సిల్ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల కార్యక్రమాన్ని కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ పి. సత్యకుమారి నిర్వహించారు. పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ ఆర్. అమరేంద్ర కుమార్, కౌన్సిల్ సభ్యులు నూతనంగా ఎంపికైన రామకృష్ణారెడ్డికి అభినందనలు తెలిపారు. ఏపీ వెటర్నరీ కౌన్సిల్ అధ్యక్షులు మాట్లాడుతూ పశు వైద్య రంగంలో వివిధ కళాశాలలు, పరిశోధన కేంద్రాల్లో జరుగుతున్న నూతన సాంకేతిక, ఆధునిక పరిజ్ఞానాన్ని క్షేత్రస్థాయిలో విస్తరించే దిశగా పలు కార్యక్రమాలు చేపడతామన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలపై నేడు సమీక్ష

త్రిపురాంతకం: మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా పార్వతీ సమేత త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీదేవి ఆలయాల వద్ద ఏర్పాట్లపై రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ శుక్రవారం సమీక్షిస్తున్నట్లు తహసీల్దార్ వి.కిరణ్ తెలిపారు. సబ్ కలెక్టర్ సేథు మాధవన్ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఈ సమీక్ష సమావేశంలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని తహసీల్దార్ గురువారం ఓ ప్రకటనలో కోరారు.


బస్సుల కోసం ఆతృతగా ఎదురు చూస్తూ..

ఆనందం ఫుల్లు

మకర సంక్రమణం జరిగింది. మదినిండా ఆనందం ఉప్పొంగింది. గింజలన్నీ గాదెలవైపు పరుగులు తీసి విశ్రాంతి దశకు చేరుకున్నాయి. 'మళ్లీ కొత్త విత్తులు వస్తాయిలే' అని చేలన్నీ బోసి నవ్వులు నవ్వాయి. విశ్రాంతి లేకుండా పని చేసిన యంత్రాలు ఆయుధ పూజతో మళ్లీ రంగంలోకి దిగుతామంటూ మీసం మెలేశాయి.

... ...

పిల్లలకు రంగుల దుస్తులు.. యువతకు కొత్త బట్టలు.. గృహిణులకు పట్టు చీరలు.. పెద్దవారికి పంచె కట్టులు.. అందరికీ కలిపి పిండి వంటలు. గ్రామీణ ఆటపాటలు.. సరదాలు. వీరంతా సంక్రాంతి ఆనందాలను వచ్చే ఏడాది దాకా తమ మెమరీ కార్డుల్లో ఫుల్లుగా ఎక్కించుకున్నారు. తమ మూలాలు మరవకుండా పట్నాల నుంచి పల్లెదారి పట్టిన వారంతా మళ్లీ తమ ఉద్యోగాలు.. చదువుల నిమిత్తం వారి గమ్యస్థానాల వైపు పయనమయ్యారు. గురువారం నుంచి విద్యాలయాలు పునఃప్రారంభం కావడంతో ఒంగోలు బస్టాండు ప్రయాణికులతో కిటకిటలాడింది.
బస్సులన్నీ ఫుల్ ఆక్యుపెన్సీతో రయ్‌మంటూ పరుగులు తీశాయి.

– ఫొటోలు. ఎం. ప్రసాద్, సాక్షి ఫొటో గ్రాఫర్


సంక్రాంతి సెలవులు ముగియడంతో కాలేజీకి పయనమైన విద్యార్థిని


టాటా చెప్పుకుంటున్న చిన్నారి స్నేహితులు


ఎవరి గమ్యం వారిది..


త్వరగా నడువు బాబూ.. బస్ మిస్ అయితే ఎలా..

కవి హనుమారెడ్డికి ఘన నివాళి


హనుమారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు, రచయితలు

ఒంగోలు: ప్రకాశం జిల్లా రచయితల సంఘం పూర్వ అధ్యక్షుడు భీమనాథం హనుమారెడ్డి వృత్తిని కోర్టుకు, కవిత్వాన్ని హార్ట్‌కు అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక రాజాపానగల్ రోడ్డులోని జిల్లా రచయితల సంఘ కార్యాలయంలో హనుమారెడ్డి తృతీయ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని కవులు, రచయితలు హాజరై హనుమారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పొన్నూరు వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ.. 25 ఏళ్లపాటు ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడిగా సేవలందించిన హనుమారెడ్డి ఎందరో యువకులను సాహిత్యం వైపు ప్రోత్సహించారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి రచయితల మహాసభలను ఒంగోలులో అనేక పర్యాయాలు నిర్వహించి సుప్రసిద్ధమైన కవులతో ఉపన్యాసాలు ఇప్పించారన్నారు. ప్ర.ర.సం ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి మాట్లాడుతూ.. హనుమారెడ్డి ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం స్వర్ణోత్సవాలను జరుపుకోవడమే కాకుండా తెలుగు లోగిలి పేరుతో వంద వ్యాసాలతో వెయ్యి పేజీలతో వ్యాస సంకల్పాన్ని ముద్రించి తెలుగు సాహితీ ప్రపంచానికి కానుకగా అందించిన సాహితీ మూర్తి హనుమారెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో రచయితల సంఘం సభ్యులు బీనీడి కృష్ణయ్య, గంగిశెట్టి నరశింహారావు, సయ్యద్ ఇస్మాయిల్, ఆవుల వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు అలవలపాడు విద్యార్థి ఎంపిక


పోటీలకు ఎంపికైన విద్యార్థి రావంత్


ఎంపిక పత్రాలు అందజేస్తున్న హెచ్ఎం కోటేశ్వరరావు, పీఈటీ

పీసీపల్లి: శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండలంలోని పెద అలవలపాడు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థి బి.రావంత్ ఎన్నికయ్యాడు. గురువారం పాఠశాలలో హెచ్ఎం కరుణకుమారి మాట్లాడుతూ ఇటీవల ఒంగోలులో డీఆర్ఆర్‌యం హైస్కూల్‌లో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ అండర్–17 విభాగంలో పాఠశాలకు చెందిన విద్యార్థి బి.రావంత్ ట్రిపుల్ జంప్‌లో ప్రతిభ కనబరిచి రెండో స్థానం పొందడం ద్వారా రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. ఈనెల 20, 21 తేదీలో శ్రీకాకుళం జిల్లాలోని కోడిరామ్మూర్తి స్టేడియం అండ్ డిగ్రీకళాశాల గ్రౌండ్స్ టి.పి.ఎం.సి హైస్కూల్ ఆవరణలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు. తమ పాఠశాల నుంచి 2022–23 విద్యాసంవత్సరంలో 11 మంది విద్యార్థులు యోగాలో, ఒక విద్యార్థి అథ్లెటిక్స్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు టి.కోటేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ చెన్నుపాటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫుట్ బాల్ పోటీలకు..

ఒంగులు రూరల్: స్కూలు గేమ్స్ రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఉలిచి జెడ్పీహెచ్ హైస్కూలు విద్యార్థి ఆరుమూళ్ళ జాన్ ఎంపికైనట్లు హెచ్ఎం కోటేశ్వరరావు తెలిపారు. అండర్ 14 విభాగంలో జనవరి 20, 22వ తేదీ వరకు వెస్ట్ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో జరగనున్న పోటీలకు ప్రకాశం జిల్లా తరఫున పాల్గొననున్న జాన్‌ను అభినందించారు. పీఈటీ ఫయాజ్, ఉపాధ్యాయులు అభినందించారు.

'నవోదయ' దరఖాస్తుకు 31 వరకే గడువు

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 31తో ముగుస్తుందని ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ టి.జయశ్రీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న ఫారాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డౌన్‌లోడ్ చేసుకున్న ఫారాలను పూర్తి చేసి 5వ తరగతి చదువుతున్న పాఠశాల హెచ్ఎంతో ధ్రువీకరించాలన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 29వ తేదీన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితిలో సీటు కోసం దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా ఒంగోలు, చీరాల, కందుకూరు, అద్దంకి, వేటపాలెం, గుడ్లూరు, వలేటివారిపాలెం, పొన్నలూరు, లింగసముద్రం, సింగరాయకొండ, ఉలవపాడు, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, సంతమాగులూరు, కొరిశపాడు, జె.పంగులూరు, మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాలకు చెంది ఉండాలని స్పష్టం చేశారు.

తాగుబోతు భర్తతో కాపురం చేయలేక..

● కొత్తగా పెళ్లైన యువతి బలవన్మరణం

దర్శి: తన భర్త తరచూ తాగి ఇంటికి వస్తున్నాడని మనస్తాపం చెందిన భార్య పందూరి సంధ్య (20) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఆమె తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఎస్సై రామకృష్ణ కేసు చేశారు. మృతదేహాన్ని పరిశీలించి మృతికి గల కారణాలు అడిగితెలుసుకున్నారు. కొమునూరి సంపత్‌కుమార్, సంధ్యకు ఐదు నెలల క్రితం వివాహం జరిగింది. అప్పటి నుంచి భర్త ప్రతిరోజూ మద్యం సేవించి ఇంటి వస్తూ భార్య మాటలను పట్టించుకోవడంలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆమె బుధవారం అర్ధ రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ శవపంచనామా నిర్వహించారు.

పోలీస్ అధికారులకు ఎస్పీ అభినందన


మార్కాపురం డీఎస్పీకి ప్రశంస పత్రం అందజేస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా యుఐ(అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులను గణనీయంగా తగ్గించడానికి కృషి చేసిన పోలీసు అధికారులను ఎస్పీ మలికా గర్గ్ ప్రశంసించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించడం ద్వారా 2023లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. 2021 నుంచి 2022 వరకు 798 యుఐ కేసులను పరిష్కరించిన 98 మంది పోలీసు అధికారులను, వారికి సహకరించిన సిబ్బందిని ఎస్పీ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణా, సరఫరా, విక్రయాలు, నాటుసారా తయారీ వంటి కేసుల్లో ప్రతిభ కనబరిచిన ఏడుగురు అధికారులు, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు. పెండింగ్ కేసులను తగ్గించడానికి ప్రణాళికాబద్ధంగా పని చేయాలని సూచించారు. నేర నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఏఎస్పీ(క్రైమ్) ఎస్‌వీ శ్రీధరరావు, ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య, డీఎస్పీలు యు.నాగరాజు, నారాయణస్వామిరెడ్డి, కిషోర్ కుమార్, డీటీసీ డీఎస్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకుంటాం

● వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత సంఘ అధ్యక్షుడు గంజి చిరంజీవి


గంజి చిరంజీవిని సత్కరిస్తున్న చీమకుర్తి చేనేత సంఘం నాయకులు

చీమకుర్తి: రాష్ట్రంలోని చేనేత కార్మికులకు అండగా ఉంటానని వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత సంఘం అధ్యక్షుడు గంజి చిరంజీవి భరోసా ఇచ్చారు. ఆయన గురువారం చీమకుర్తి చేనేత సొసైటీ ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా చేనేత సొసైటీ సంఘం సభ్యులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను చిరంజీవి దృష్టికి తీసుకురాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ సోమా శేషాద్రి, చేనేత సంఘం అధ్యక్షుడు అవ్వారు ఆదినారాయణ, సోమా యానాదిశెట్టి, గోపురపు చంద్ర, మర్రి లక్ష్మీనారాయణ, దోమల పుల్లయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టు శిక్షణ ప్రారంభం


శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు పంచాయతీ అలగాయపాలెంలో ఉమ్మడిప్రకాశం జిల్లా అండర్ 17 వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సుబ్బారావు మాట్లాడుతూ ఈ నెల 22 వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తామన్నారు. అనంతరం జిల్లా తుది జట్టును ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపిక చేసిన జట్టు 23 నుంచి కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. శిక్షణ శిబిరానికి ఇన్‌చార్జిగా కరేడు ఉన్నత పాఠశాల పీడీ ఓగుబోయిన శ్రీనివాసులు వ్యవహరిస్తారని తెలిపారు. కోచ్‌లుగా వాయల బాబు, వాయల నరేష్‌లు ఉంటారన్నారు. వీరి ఆధ్వర్యంలో శిక్షణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో చాకిచర్ల ఉన్నత పాఠశాల పీడీ శ్రీనివాసులు, గ్రామకాపులు పాల్గొన్నారు.

చెడుగుడు విజేత నెల్లూరు


ఫైనల్‌లో తలపడుతున్న ప్రకాశం–గుంటూరు జట్లు

● మహిళల విభాగంలో ప్రకాశం సత్తా

నాగులుప్పలపాడు: సంక్రాంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అమ్మనబ్రోలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆహ్వాన చెడుగుడు పోటీల విజేతగా నెల్లూరు జిల్లా జట్టు నిలిచింది. పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చుండూరి రవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రాచీన క్రీడలను ప్రోత్సహిస్తున్న నిర్వాహకుడు, పార్టీ నాయకుడు కాట్రగడ్డ శ్రీనివాసరావును అభినందించారు.

ఫైనల్ మ్యాచ్ మహిళా విభాగంలో ప్రకాశం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. విజేత జట్టుకు రూ. 40 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన గుంటూరు జట్టుకు రూ.30 వేల రూపాయలను అందజేశారు. అనంతరం జరిగిన పురుషుల ఫైనల్ మ్యాచ్‌లో నెల్లూరు- ప్రకాశం జట్లు పోటీ పడగా నెల్లూరు జట్టు విజేతగా నిలిచి రూ. 50 వేల రూపాయల నగదు బహుమతి పొందింది. రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరో స్థానాల్లో ప్రకాశం, పశ్చిమ గోదావరి, ఆర్.బి. పాలెం, చీరాల, గుంటూరు జట్లు నిలిచాయి. రూ. 40 వేలు, రూ. 30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ. 10 వేలు వరుస బహుమతులుగా అందించారు.